# చక్రబంధం




ఆకెళ్ల వెంకట సూర్యనారాయణ

వచ్చేసింది. ధనలక్ష్మి జేబు ఎక్కేసింది.

ప్లాస్టిక్ పర్సులో ముడిచిపెట్టుకుని కూర్చుంది. ధనలక్ష్మి వస్తూ ఆనందాన్ని తేలేదు సరికదా ఆవేదన తెచ్చింది. వచ్చే ముందు మూడు రోజులు, వచ్చిన తర్వాత మూడు రోజులు... ప్రతి నెలా కలతనిద్ర, ఆలోచనలు. గుండెలమీద చేయి వేసుకుని నిద్ర పోనివ్వదు.

లక్ష్మి చంచల చిత్తురాలు. ఆఫీసు గేటు దాటకుండానే పరుగులు.

"కామ్రేడ్! యూనియన్ చందా!"

క్లబ్ చందా గురూ...

సెండాఫ్ పార్టీ టు సెక్షన్ ఆఫీసర్ బాస్ బ్రదర్! ఎవడో పోయేడు. వాడి కుటుంబానికి రిలీఫ్. క్యా భాయ్ వడ్డీ!

లక్ష్మి ఊరుకుంటుందా! వాళ్ళ దగ్గరకు చేరిపోవటం మొదలెడుతుంది.

ఈవాళ అలాగే చేరిపోయింది. అన్ని పోను బేలన్స్ నాలుగొందలు... పది... ముప్పయి... నలభై... మొత్తం మిగిలింది. ఫోర్‌పిఫ్టీ.

"మా ఆయనకు జీతం ఏడు వందల అరవై" మట్టుపక్కం వాళ్ళకు వాణి చెప్పే జీతం. ఆ మాట చెప్పేటప్పుడు ఆ ముఖంలో వెలుగు, పుచ్చుకునేటప్పుడు దిగులు.

పి. ఎఫ్. కంట్రిబ్యూషన్, లోను, ఇన్సూరెన్సు, పండగలోను... సైకిలులోను... తుఫానులోను...

అవును. తుఫాను లోను అంటే గుర్తొచ్చింది. వంశీధార వరదలొచ్చేయిగా... శ్రీకాకుళం జిల్లాలో ఇల్లు, వాకిలి ఉంటే వరద ఎడ్వాన్సు ఇస్తారని ఇందాకా... వైద్యనాథ్ చెప్పేడు.

వైద్యనాథ్ చిత్రమైనవాడు. మెడికల్ బిల్సుతో ఇల్లు కట్టేసి సార్థక నామధేయుడయ్యేడు. డాక్టరుకి, మెడికల్ షాపుకి పర్సెంటేజిట.

సరే ఆ గొడవెందుకు. తమా వరద ఎడ్వాన్సు పెట్టాలి. ఉర్లం కరణాన్ని పట్టుకుని అక్కడో తనకో పాక ఉండేదని... వరదల్లో కొట్టుకు పోయిందని కాగితం పుచ్చుకోమని సూరికి రాయాలి.

ప్రభుత్వాన్ని మోసగించటం తప్పేమో... ప్రభుత్వం అంటే ఎవరూ? ప్రజలు... ఆ ప్రజల్లో తమా ఒకడు. అంటే తనని తనే మోసం, ఆత్మవంచన.

తను మాత్రం ఏం చేస్తాడూ? తను ఉద్యోగం జాయిన్ అయ్యేనాటికి తన జీతం రెండు వందల అరవై. ఒ రోజు కాసు బంగారం, మూట ముప్పయి. నెల జీతంతో పెళ్ళికి వాణికి రెండు కాసులు బంగారం కొన్నాడు. ఇప్పుడు తన జీతంతో అరకాసు బంగారం వస్తుందా? అనుమానమే. ఖరీదులు పదిరెట్లు పెరిగితే జీతం...మూడు

రెట్లు పెరుగుతోంది. అవసరాలు పెరుగు తున్నాయి.

ఎవరామ్మాయి ? బస్సు కదుల్తుంటే ఎక్కుతోంది. జగదీశ్వరిలా ఉందే. కాదు. జగదీశ్వరి ఎక్కడుందో ? 'పేపర్ షీట్' అని పేరెట్టి ఆమెని కాలేజీ డేస్‌లో ఏడిపించేవాడు. ఆ రోజులు వేరు. నడి వయసు వచ్చేసింది.

మరో పదేళ్ళుపోతే ఆ ముసలాయనలా వంగి ఎడవాల్సిందే. ముసలాయన పక్క నెవరూ ? కూతురయి ఉండమ్మ. నిండుగా ఉంది. పొట్ట ఎత్తుగా ఉంది. నీళ్ళోసు కుందేమో.

యస్. ఇంటి దగ్గర పూర్ణా నీళ్ళోసు కుంది. నాన్‌సెన్స్ నీళ్ళోసుకోవటం ఏమిటి? వాళ్ళు నీళ్ళోసుకున్నా, నిప్పులోసుకున్నా, తనకేం అభ్యంతరం లేదు. కాని అమ్మ –

"ఒరేయి. ఆడది తొలిచూలుకి తల్లి చాటుకి, చంటి బిడ్డలా చేరాల్సిందేరా! పూర్ణని పురిటికి తీసుకొచ్చేవు. సంతోషం. నాన్న లేకున్నా – మా అన్న పురిటికి తీసుకొచ్చేడని – అది సంబరపడిపోతోంది. సూడిదలిచ్చి తెచ్చేం. ఇక ఆ గాజుల వేడుక కూడా జరిపేస్తే బావుంటుంది. పెద్దదానికి మీ నాయన బ్రతికున్నారుగనక్క పెళ్ళిలా ఆర్భాటంగానే చేశారు. అంతలా నువ్వు తూగలేవు. అయినంత మాత్రంచేత ఆడపిల్ల పుట్టింట అచ్చట, ముచ్చట కోసం ఆశ పడకుండా ఉండదు కదా... ఎలాగో గాజుల వేడుకా... జరిపేస్తే అదీ సంతోషిస్తుంది. మళ్ళీ ఇక ఆఖరిదాని పెళ్ళయి, దాని కడుపునో కాయ కాసినపుడు కాని ఆ ముచ్చట ఉండదు కదా ?"

నిజమే ! అమ్మ చెప్పింది. వాళ్ళ కడుపుల్ని కాయలు కాస్తున్నాయి. కాని రూపాయలు చెట్లకి కాయడంలేదే ? ఎలా ?

'అన్నయ్యా ! ఇదిగో ఈ పట్టు పరికిణి, వోణి పాపాయమ్మగారి ద్వారా... అరువు తెచ్చేను. నూట నలభై అయింది. నెలకో ముప్పయి ఇమ్మంది.'

కళ్ళు విప్పేసరికి కడుపున బుట్టిన కుర్రాడ్ని ముందేసుకుని గృహలక్ష్మి –

'వీడికి కాన్వెంటు సీటు ప్రయత్నం చేసేరా ? ప్రక్కింటావిడ... ఇట్టే వెళ్ళి మూడు వందలు కట్టి పిల్లాడ్ని చేర్పించి వచ్చింది. మీరు బద్ధకిస్తే ఒక్కగా నొక్క కుర్రాడి భవిష్యత్తు దెబ్బతింటుంది. తర్వాత ఎటూ ఆడవాళ్ళగ...'

ఏమిటీ ! బస్ ఇంకా రాదు. పోః నడిచి పోతే జీతంవాడు నడకే... పండగవాడు పాతమొగుడే... పండగంటే గుర్తొచ్చింది. దీపావళి ఇదే నెల... ఈ జీతమే దీపావళ్ళి పొగుపంపాలి. పెద్ద చెల్లెలు గాజులు...చిన్నదాని బట్టలు, కుర్రాడి కాన్వెంట్ జాయినింగ్... మై గాడ్ !

పాశాలు... ఇవన్నీ పాశాలు... సిగరెట్ కాలిస్తే బావుణ్ను.

'ఓ బర్కిలీ ఇవ్వు.'

పదిహేను పైసలా ... పెట్టె రూపాయి నలభై ... సిగరెట్ కొక పైసా పోతుందే... పేకెట్ కొంటే ... తను టెంప్టు అయి ఎక్కువ కాల్చేస్తాడు. అన్నీ ఆలోచించే వాళ్ళు ధర నిర్ణయిస్తారు. బిజినెస్ పీపుల్.

వాడెవడి దాకానో ఎందుకూ? ఇందాకా... కామేశం ఉరఫ్. షైలాక్ ఏమన్నాడూ ?

"గురూ ... నన్ను షైలాక్ అంటారని నాకు తెల్సు. షైలాక్ గడువుపెట్టి గడువు దాటితే మాంసం అడిగేడు. కాని నేను గడువే పెట్టనే! నువ్వు నూటికి పది వడ్డీ ఇస్తున్నంత కాలం...గడువు ప్రశ్నేలేదు..." అంటూ నలభై బ్యాగ్‌లో వేసుకుని వెళ్ళి పోయేడు.

కామేశం అమెరికాలో పుట్టాల్సినవాడు. వాడు తాతాకి, బిర్లాకి పెర్సనల్ క్లాసులు తీసుకోగలడు.

పోనీ ... ఈ నెల వాడ్నే అప్పు అడిగితే ? లాభం లేదు. వాడిదివరకు టైపిస్టు అప్పు అడిగితే చెప్పలేదా ?

"గురూ ... ప్రతివాడికి దేవుడు ఆయుర్దాయం ఫిక్స్ చేసినట్లు, నేను వాడి అప్పు కెపాసిటి ఫిక్స్ చేసుకుంటాను. నీ ఆయుష్షుకి సరిపోయే అప్పు ఇచ్చేశాను. ఇంక అడగకు" తేలిగ్గా అనేసేడు. తప్ప అలాగే అనేయగలడు.

బస్సు ఆశవదిలేసి నడిచేయటం బెటర్. ఎవరామె ? అందంగా ఉంది. కునేగా వాసన ఎప్పుడో కాలేజీ డేస్‌లో తనూ ప్రేమించేడు. ఆ రోజుల్లో లెక్చరర్ బిందుమాధవరావుని చూసి ఇన్‌స్పైయిర్ అయి లెక్చరర్ కావాలనుకున్నాడు.

గుమాస్తా అయ్యేడు.

రోడ్డుమీద డ్రయినేజ్ మూతలేదు. తన బోటివాళ్ళు పడిపోతారు. తమ బ్రతుకుల డ్రయినేజ్‌కి మూతలుండవు. సంసార కూపంలో ఇరుక్కుపోవాల్సిందే !

నిన్నరాత్రి పద్దు ప్రకారం ఖర్చు తొమ్మిదొందలు. అంటే సుమారు అయిదొందలు అప్పు. అప్పెక్కడా ?

అప్పారావ్‌లా తిరగాల్సిందే ! ఋణానందలహరి రాసిందెవరూ ? జీనియస్

